క్లుప్తంగా

వైభవం.. కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, నడుమ శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణం జరిపారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు.

సమాజ సేవలో సంతృప్తి



సర్టిఫికెట్ అందజేస్తున్న పారిశ్రామికవేత్త గౌరీశంకర్

పెళ్లకూరు: సమాజసేవలోనే సంతృప్తి ఉంటుందని ప్రముఖ పారిశ్రామిక వేత్త చాగణం గౌరీ శంకర్ అన్నారు. శనివారం పెళ్లకూరులోని చాగణం లలితమ్మ–భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పలు కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ సోమయ్య, ఇన్‌చార్జి ఎస్‌ఐ శ్రీకాంత్, సీఈఓ సీతారామయ్య, సభ్యులు శ్రీలక్ష్మి, మురళి, కీర్తితేజా, కృష్ణ పాల్గొన్నారు.

దారి ఆక్రమిస్తున్నారు!

చిల్లకూరు: మండలంలోని తొణుకుమాల సమీపంలో పేదల భూములకు వెళ్లే దారిని కొంతమంది ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు సీపీఐ నాయకులతో కలసి రెవెన్యూ కార్యాలయం ఎదుట శనివారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పొలాలకు వెళ్లే దారి ఉండడంతో తాము నేరుగా వెళ్లే వారమని అన్నారు. అయితే ఇటీవల ఆ ప్రాంతంలో కొంత మంది భూములు కొనుగోలు చేసి పేదల భూములకు వెళ్లే దారిని పూర్తిగా ఆక్రమించారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆర్, సర్వేయర్లను పంపి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. సీపీఐ నేతలు సీహెచ్ ప్రభాకర్, సీవీఆర్ కుమార్, ఎంబేటి చంద్రయ్య, శశికుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీరుల త్యాగాల స్ఫూర్తితో ముందుకు సాగాలి



పూజలు చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు: భరతమాత ముద్దు బిడ్డలుగా గర్వపడే మనమంతా దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను స్ఫూర్తితో దేశాభివృద్ధి కోసం ముందుకు సాగాలని ఎంపీపీ శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఊరూరా సేకరించిన మట్టి కలశాలకు పూజలు చేశారు. అందరూ కలిసి పంచ్ ప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కలశంతో నాయుడుపేటకు బయలుదేరి వెళ్లారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, ఏపీఓ దయానంద్ పాల్గొన్నారు.

నీటి సమస్యపై విచారణ



విచారణ జరుపుతున్న ఎంపీడీఓ నిర్మలాదేవి

చిల్లకూరు: గ్రామంలో కొన్ని ప్రాంతాలకు తాగు నీరు అందడం లేదని గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో నేరుగా ఎంపీడీఓ నిర్మలాదేవి శనివారం విచారణ చేపట్టారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లెలో తాగునీటి పథకానికి సంబంధించి అన్ని వీధుల్లో పైపులైన్లు వేశారు. అయితే ఓ ప్రాంతంలో ఎత్తుగా ఉండడంతో అక్కడకు కొంత ఆలస్యంగా నీరు పరఫరా అవుతుంది. నెల రోజులుగా ఆ ప్రాంతానికి తాగునీరు సక్రమంగా అందకపోవడంతో వారు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె, పంచాయతీ కార్యదర్శి జమీర్‌తో కలసి ఆ ప్రాంతంలోని ప్రతి ఇంటిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

మండల కార్యాలయంలో పూజలు



పూజల్లో పాల్గొన్న ఎంపీపీ తనూజారెడ్డి

వెంకటగిరిరూరల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.2 కోట్లతో నిర్మాణం జరుగుతున్న నూతన మండల పరిషత్ కార్యాలయ భవనంలో ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి శనివారం పూజలు చేశారు. నిర్మాణంలో ఉన్న భవనానికి సింహద్వారం ఏర్పాటులో భాగంగా ప్రత్యేక పూజలు చేసి, అమర్చారు.

108లో ప్రసవం

వెంకటగిరిరూరల్: పట్టణంలోని ఎన్టీఆర్‌కాలనీ వద్ద 108 వాహనంలో ఓ గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. డక్కిలి మండలం చాపలపల్లెకు చెందిన గౌరికి పురిటినొప్పులు రావడంతో ఆమెను వెంకటగిరికి తరలిస్తుండగా ఎన్టీఆర్‌కాలనీ వద్దకు వచ్చే సరికే నొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈ ఎంటీ రవికుమార్ గౌరికి సురక్షిత ప్రసవం చేయించారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది.

ఒకప్పుడు మంచి ఎడ్లు ఉండి..వ్యవసాయం బాగా సాగితే మోతుబరిగా చెప్పుకునే వారు. నాడు ఎకరం భూమి ఉన్న రైతుకు సైతం జత ఎడ్లు ఉండేవి. బండి కట్టుకుని ఇంటిల్లిపాది అందులో కూర్చుని పొలానికి వెళ్లేవారు. ఎద్దులు ఉంటే రాజసంగా భావించేవారు. కానీ ఆ రాజసం నుంచి ఇప్పుడు ఎడ్లు వెళ్లిపోయాయి. వ్యవసాయం మాత్రమే మిగిలింది. నేడు వంద ఎకరాలున్న కర్షకులు సైతం ఎడ్లను పోషించడం లేదు. అన్ని పనులకు యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. కనుమరుగవుతున్న కాడెద్దులపై ఆదివారం ప్రత్యేక కథనం.



కాడెద్దులతో పొలంలోకి వెళుతున్న మహిళా రైతు

భూసామి.. కాడెద్దులు లేని ఆసామే

- అద్దె అరకలే ఆధారం
- పోషణభారమై..యంత్రాలకు చేరువై
- కాడెద్దులు కనుమరుగు



ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతున్న రైతు

మండలం:	సైదాపురం
మొత్తం గ్రామాలు:	48
వ్యవసాయభూమి:	16 వేల ఎకరాలు
మోతుబరి రైతులు:	5500
సన్న,చిన్నకారు రైతులు:	1500
ట్రాక్టర్లు:	300
కాడెద్దులు:	50 నుంచి 60 జతలు

సైదాపురం: పల్లెలంటే పచ్చని పొలాలు కాదు.. పశువులు.. కాలుష్యం లేని వాతావరణ కూడా. ఒకప్పుడు వ్యవసాయానికి ఎద్దులే ప్రధాన ఆధారం. కాడెద్దులే అన్నదాతకు వెన్ను దన్నుగా నిలిచేవి. ఆరుగాలం వ్యవసాయ పనుల్లో వెన్నంటి ఉంటూ రైతన్నకు తోడుగా ఉండేవి. ప్రతి అన్నదాత ఇల్లూ ఎద్దులు, బర్రెలు, పాడి ఆవులతో కలకలలాడుతుండేవి. ఇంట్లో పాలు, పెరుగు, మజ్జిగ, వెన్న, నెయ్యి పుష్కలంగా ఉండేవి. అయితే ప్రస్తుతం ఏ గ్రామంలోనూ ఇలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. మారిన పరిస్థితులతో ఆవులు, ఎద్దులను అమ్ముకుంటున్నారు. వ్యవసాయంలోనూ యాంత్రీకరణ పెరుగుతోంది. ఫలితంగా పశుపోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో కాడెద్దులు కనుమరుగువుతున్నాయి.

16 వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు

సైదాపురం మండలంలోని 48 గ్రామాల్లో సుమారు 5500 మంది మోతుబరి రైతులు, 1500 మంది సన్న, చిన్నకారు రైతులు ఉన్నారు. వీరందరూ సుమారు 16 వేల ఎకరాల విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారు. ఇందులో నిమ్మ సుమారు 9 వేల ఎకరాలు, వరి 7 వేల ఎకరాలు సాగు చేస్తున్నారు. ఇందుకోసం రైతులు సుమారు 300 ట్రాక్టర్లు, 50 నుంచి 60 కాడెడ్లను వినియోగిస్తున్నారు. మోతుబరి రైతులు మాత్రం అధిక మొత్తంలో పొలం ఉండడంతో యంత్రాలను కొనుగోలు చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వారిలోనూ ఎక్కువ శాతం మంది అద్దె పరికరాలపై ఆధారపడుతున్నారు. సన్నకారు రైతులు మాత్రం యంత్రాలను అద్దెకు తీసుకోవాల్సివస్తోంది.

చిన్న, సన్నకారు రైతులకు ఇక్కట్లు

చిన్న, సన్నకారు రైతులు కాడెద్దులు లేక, వ్యవసాయ పనులు సకాలంలో సాగక ఇక్కట్లు పడుతున్నారు. చిన్న, చిన్న కమతాలు ఉన్న రైతులు సైతం ట్రాక్టర్లు, రోటావేటర్లు, ఇతర యంత్రాలపై ఆధారపడుతున్నారు. స్థానికంగా దొరకని కొన్ని యంత్రాలను ఇతర ప్రాంతాల నుంచి కూడా నెలవారీ అద్దెకు తెచ్చుకుని వ్యవసాయ పనులకు ఉపయోగించాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో కాడెద్దులు లేక వ్యవసాయం కుంటుపడుతుంది. సమయానికి అద్దె యంత్రాలు దొరక్క వ్యవసాయ పనులు సాగడం లేదు.

పశువులు లేక అగచాట్లు

వ్యవసాయం చేయాలంటే గతంలో కచ్చితంగా కాడెద్దులు ఉండాలి. పశువులు లేనిదే ఒకపూట కూడా రైతులకు గడిచేది కాదు. సాగు ప్రారంభం నుంచి నూర్పిడి వరకు అన్ని పనుల్లోను కర్షకులకు అన్ని పనుల్లోనూ కాడెద్దులు అండగా ఉండేవి. దీనికితోడు పశువుల వ్యర్థాలు పంటసాగుకు ఎరువుగా ఉపయోగపడేవి. పశువుల పేడను పొలాల్లో వేస్తుండటంతో అధిక దిగుబడులు వచ్చేవి. ప్రస్తుతం పశువులు లేక, రసాయన ఎరువులపై ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా భూసారం తగ్గడంతోపాటు, నాణ్యమైన పంట దిగుబడులు కరువయ్యాయి.

అంతరిస్తున్న పశుసంపద

వ్యవసాయంలో పెరిగిన యాంత్రీకీకరణ, భారంగా మారిన పశుపోషణ, మారిన అన్నదాత జీవనశైలి తదితర కారణాలతో పశువు సంపద అంతరిస్తోంది. ఉన్న ఒకటి అరా పశువులను సైతం విక్రయిస్తుండడంతో వ్యాపారులు వాటిని కబేళాలకు తరలిస్తున్నారు.

ట్రాక్టర్‌తో దుక్కులు



“ నేడు రైతులందరూ పశువులను అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం తొలకరి చినుకులు పడ్డాయి. సేద్యానికి పశువులు లేకపోవడంతో అందరు ట్రాక్టర్లుతో దుక్కులు చేసుకుంటున్నారు. వరినాట్లు, కలుపు తీత, వరి నూర్పిడి అన్ని పనులకూ ప్రస్తుతం యంత్రాలపైనే ఆధారపడుతున్నాం.

–ఎం. ఆదిశేషయ్య నాయుడు, ఆదూరుపల్లి

యంత్రాలతోనే వ్యవసాయం



వ్యవసాయానికి కొత్త, కొత్త పరికరాలు వస్తున్నాయి. ప్రభుత్వం వ్యవసాయ పరికరాలకు రాయితీ ఇస్తోంది. అధికారులకు యంత్రాల వైపే రైతులను మళ్లిస్తున్నారు. కరువులో పశువులు లేక కూలీలు దొరక్క పోవడంతో అధికంగా రైతులు యాంత్రీకరణపైనే దృష్టి సారిస్తున్నారు. – నలమారు రాంగోపాల్‌రెడ్డి, సైదాపురం

సమష్టికృషితో అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్

డక్కిలి: ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు సమష్టి కృషితో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజాప్రతినిధులు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ రాజశేఖర్, వైస్ ఎంపీపీ గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో పనిచేసే సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. మండలంలోని కమ్మపల్లె, కందలవారిపల్లె, ఆత్తలసిద్ధవరం ఎస్టీ కాలనీలు, వెలికల్లు తదితర ప్రాంతాల్లో పని చేసే పొదుపు సీసీ లు నిధులు స్వాహ చేశారని మాధవయ్యపాళెం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్ వేణుగోపాల్ నాయుడు, వెలికల్లు సర్పంచ్ వెంకటరమణ మండి పడ్డారు. దీంతో స్పందించిన ఏపీఓ మాట్లాడుతూ నాలుగు బృందాలు నిధులు దుర్వినియోగంపై విచారణ చేసి తగు నివేదికలను పీడీకి సమర్పించామన్నారు. త్వరలో బాధ్యులపై చర్యలు తీసుకుంటారన్నారు. పీహెచ్‌సీని సాయంత్రం 6 గంటలకే మూసేస్తున్నారని, రాత్రి సమయాల్లో ఏదైనా ఆపద వస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పలువురు సభ్యులు అన్నారు. దీనిపై స్పందించిన వైద్యాధికారి ఇటీవల సిబ్బంది కొరతతో పీహెచ్‌సీని మూసి వేసిన విషయం వాస్తవమేనని, జిల్లా అధికారులు దృష్టికి ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కే రాజేశ్వరి, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ అధికారుల తనిఖీలు

సైదాపురం:మండలంలోని ఊటుకూరు, జోగిపల్లెలో శనివారం జిల్లా మైనింగ్ అధికారులతో పాటు విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ పలు గనులను పరిశీలించారు. వాటికి సంబంధించిన రికార్డులను కూడా తనిఖీలు చేశారు. అనుమతులు లేకుండా తవ్వకాలను సాగించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

రెవెన్యూ సమస్యలపై అశ్రద్ధ తగదు

సైదాపురం: రెవెన్యూ సమస్యలపై అశ్రద్ధ తగదని, వేగవంతంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ నాగినేని శ్రీనివాసులు ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, బూత్ లెవల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను తక్షణమే వీఆర్వోలు, సర్వేయర్లు కలిసి అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. అలాగే ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిష్పక్షపాతంగా సర్వే చేయాలన్నారు. అలాగే అక్రమ మైనింగ్‌పై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

మహాసభను విజయవంతం చేయండి

డక్కిలి: హైదరాబాద్‌లో ఈ నెలాఖరులో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నేతలు పల్లిపాటి రవి, కంటిపల్లి మణి మాదిగ పిలుపునిచ్చారు. మహసభకు జనసమీకరణలో భాగంగా మండలంలోని చాకలపల్లె, రామరాజుపల్లెలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నరేంద్ర, నితిన్ అమర్నాథ్, విజయ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

మూడు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం



డక్కిలి: ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు



పాలేపు చిట్టెమ్మ, శ్రీపురం



నిడిగంటి బుజ్జమ్మ, దండవోలు



గుంటగోగుల మురళి అల్తూరుపాడు

డక్కిలి: మండలంలోని అల్తూరుపాడు, దండవోలు, శ్రీపురం పంచాయతీల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. శ్రీపురం పంచాయతీ 8వ వార్డులో జరిగిన ఎన్నికల్లో మొత్తం 131 ఓట్లుకుగాను 111 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి పాలేపు చిట్టెమ్మకు 90 ఓట్లు రాగా టీడీపీ మద్దతు అభ్యర్థి మోరా లక్ష్మమ్మకు 21 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి శ్రీనివాసులు చిట్టెమ్మను విజేతగా ప్రకటించారు. దండవోలు పంచాయతీలో 5వ వార్డులో మొత్త 68 ఓట్లకు గాను 61 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి నిడిగంటి బుజ్జమ్మకు 37 ఓట్లు రాగా టీడీపీ మద్దతు అభ్యర్థి చిట్టేటి రోశయ్యకు 23 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారి సుబ్బారావు బుజ్జమ్మను 14 ఓట్లు అధిక్యంతో గెలుపొందినట్లు ప్రకటించారు. అల్తూరుపాడు పంచాయతీలో ఒకటో వార్డులో మొత్తం 136 ఓట్లకుగాను 115 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి గుంటకోగుల మురళికి 60 ఓట్లు రాగా టీడీపీ మద్దతు అభ్యర్థి ముద్దా శివప్రసాద్‌రెడ్డికి 55 ఓట్లు వచ్చాయి. ఎన్నికల అధికారి కే విష్ణు వైఎస్సార్ సీపీ మద్దతుదారుడు జీ మురళీ విజయం సాధించినట్లు ప్రకటించారు.

ప్రశాంతంగా ఉప ఎన్నికలు..

డక్కిలి మండలంలోని శ్రీపురం, దండవోలు, అల్తూరుపాడు గ్రామాల్లో శనివారం జరిగిన వార్డు ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాలు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్‌ఐ నాగరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల సరళిని ఎంపీపీ జీ రాజశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీ శ్రీనివాసులురెడ్డి, అల్తూరుపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు పీ దశరథరామిరెడ్డి పర్యవేక్షించారు.

గిలకపాడులో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి విజయం

రాపూరు: మండలం గిలకపాడు గ్రామంలోని శనివారం జరిగిన వార్డు ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి చల్లా రాజగోపాల్ విజయం సాధించారు. ఈ వార్డులో 136 ఓట్లుకు గాను 120 ఓట్లు పోలైనట్లు అధికారులు చెప్పారు. చల్లా రాజగోపాల్‌కు 81 ఓట్లు, తిరుమలకొండ అంకయ్యకు 39 ఓట్లు వచ్చినట్లు మరో అభ్యర్థి పచ్చా నరేష్‌కు ఒక్క ఓటు కూడా రాలేదని ఎన్నికల అధికారి జిలానీబాషా ప్రకటించారు. అలాగే పులిలగిలపాడు 8 వార్డుకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారు నిమ్మళ విజయమ్మ విజయం సాధించింది.

కొండాపురంలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి విజయం

వాకాడు: కొండాపురం 7వ వార్డు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి మల్లి గిరిజ విజయం సాధించారు. మొత్తం 133 ఓట్లు ఉండగా అందులో 117 ఓట్లు పోలయ్యాయి. టీడీపీ బలపరిచిన అభ్యర్థి చెమిర్తి సంధ్యపై వైఎస్సార్ సీపీ మద్దతుదారు మల్లి గిరిజ 5 ఓట్ల మెజారిటీతో విజయం సాధించింది. వైఎస్సార్‌సీపీ నేతలు గిరిజకు అభినందనలు తెలిపారు.

10 ఓట్ల మెజార్టీతో పుల్లమ్మ గెలుపు

కోట: మండలం కేశవరం పంచాయతీ ఐదో వార్డు ఉపఎన్నికలో వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసిన ఉల్లిపాయల పుల్లమ్మ 10 ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్లు శనివారం ఎన్నికల అధికారులు ప్రకటించారు. వార్డులో మొత్తంగా 208 ఓట్లు ఉండగా శనివారం జరిగిన పోలింగ్‌లో 184 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినయోగించుకున్నారు. ఇందులో రేవతికి 87 ఓట్లు రాగా ఉల్లిపాయల పుల్లమ్మకు 97 ఓట్లు వచ్చాయని, దీంతో పుల్లమ్మను విజేతగా ఎన్నికల అధికారి ప్రకటించారు.



వాకాడు: విజేత గిరిజను అభినందిస్తున్న నేతలు



రాపూరు: ధ్రువపత్రం అందజేస్తున్న జిలానీ బాషా



కోట: ధ్రువపత్రంతో పుల్లమ్మ

మొక్కలు పెంచుదాం..పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



కలశాలలో మట్టిని సేకరించి, ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే

నాయుడుపేట: మొక్కల నాటి, సంరక్షించి.. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ స్థాయిలో నా భూమి–నా దేశం మట్టి సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి మాట్లాడుతూ భూమిని, దేశాన్ని రక్షించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన, స్వాతంత్ర్య సాధనలో పాలుపంచుకున్న ప్రతి నేతను స్మరించుకుందామని చెప్పారు. భూమిపై ఎవరికీ హక్కులేదు.. మనకే హక్కులు ఉన్నాయని భారతీయుడు గర్వపడాలని సూచించారు. ప్రతి గ్రామంలో మట్టిని సేకరించి, శిలాఫలకాలు ఏర్పాటు చేశామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్మరణకు శిలాఫలకాలు ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సూళ్లూరుపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి సేకరించిన మట్టిని ఒకే కలశంలో పోసి, జిల్లా కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ టీ జనార్దన్ రెడ్డి, ఎంపీపీ కురుగుండ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, మండల కన్వీనర్ టీ సుబ్రమణ్యంరెడ్డి, మాజీ డైరెక్టర్ కే మాధవరెడ్డి, కట్టా వెంకటరమణారెడ్డి, ఓ కిషోర్ యాదవ్, శేఖర్‌రెడ్డి, సీ కుమార్, పీ హరిరెడ్డి, ఎంపీడీఓలు ప్రమీలారాణి, శివప్రసాద్, ఏపీఓ షీలుబాను, ఉష పాల్గొన్నారు.

బాబు మాయమాటలతో మోసం చేశారు!



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: అబద్ధపు హామీలు, మాయమాటలతో చంద్రబాబు ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. వెంకటగిరిరూరల్ మండలంలోని యాతలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని తెలుసుకుంటూ సంక్షేమ పథకాలు బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు గడప గడపకు వద్దకు వెళ్లిన నేదురుమల్లికి స్థానిక ప్రజలు కర్పూరహారతులిచ్చి, ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై అధికారులతో చర్చించి అక్కడిక్కడే పరిష్కార దిశగా చర్యలు తీసుకున్నారు. నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో అబద్ధపు హామీలతో మ్యానిఫెస్టో తయారు చేసి ఒక పథకం కూడా అమలు చేసిన పాపన పోలేదన్నారు. రూపాయికే పేదలకు ఇళ్లు ఇస్తామని మోసపూరిత మాటలు చెప్పిన, పేదలకు కనీసం గూడు లేకుండా చేసిన చరిత్ర హీనుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. అయితే అధికారం చేపట్టిన అనతికాలంలోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం హామీలను నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు నాగయ్య, కే శ్రీనివాసులరెడ్డి, భాస్కర్, సర్పంచ్ పీ పెంచలమ్మ, ఉప సర్పంచ్ దివ్య, జేసీఎస్ మండల కన్వీనర్ ఎం వెంకటేశ్వర్లు, నాయకులు చిన గురవయ్య, సుబ్బరాయులు, వేణురెడ్డి, నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి, రమణారెడ్డి, గిరిధర్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ పద్మావతి పాల్గొన్నారు.

భూమనకు నేదురుమల్లి అభినందనలు



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని అభినందిస్తున్న నేదురుమల్లి

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి శనివారం అభినందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయన్ని నేదురుమల్లి తిరుపతిలో మర్యాపూర్వకంగా కలిశారు. భూమన కరుణాకరరెడ్డికి శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, అభినందించారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి



ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

గూడూరురూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎస్.సరస్వతీదేవి సూచించారు. శనివారం గూడూరులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, పట్టణంలోని అర్బన్‌హెల్త్ సెంటర్, ఫైలేరియా కేంద్రాలను పరిశీలించారు. ఫైలేరియా వ్యాధిగ్రస్తుల వివరాలు తెలుసుకుని, వారికి తగిన సూచనలివ్వాలని చెప్పారు. అనంతరం లాబ్ రికార్డులను తనిఖీ చేశారు. తరువాత ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి జి.విద్యాసాగర్‌రావు, గూడూరు, వెంకటగిరి సబ్ యూనిట్ అధికారులు కె.రామరాజు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు.. మైక్‌సెట్ వితరణ



వితరణ చేసిన క్రీడా పరికరాలు, మైక్‌సెట్‌తో దాత

పెళ్లకూరు: మండలంలోని చెంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాలకు శనివారం అదే గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి రాజావైదీశ్వరన్ క్రీడా పరికరాలు, మైక్‌సెట్ వితరణ చేశారు. విద్యార్థులకు అవసరమైన క్యారంబోర్డులు, వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్ బ్యాట్‌లు తదితర క్రీడా పరికరాలతోపాటు పాఠశాలకు అవసరమైన మైక్‌సెట్ అందజేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు పూర్వవిద్యార్థి రాజావైదీశ్వరన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, పీసీ చైర్మన్ యోగీశ్వరయ్య, పీడీ రమణయ్య, పుష్పలత పాల్గొన్నారు.



ఆశీర్వాదం

వెంకటగిరి రూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు లక్కమనేని కోటేశ్వరరావు కుమారుడు సాయితేజ వివాహం వెంకటగిరి ఎస్ఎల్ఆర్ కల్యాణమండపంలో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణయాచేంద్ర, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తదితరులు హాజరై, నూతన వధూవరులు సాయితేజ, అభినయను ఆశీర్వదించారు.

ఆర్డీఓ రక్తదానం



రక్తదానం చేస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో శనివారం బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీఓ తల్లి సరోజమ్మ పుట్టిన రోజు సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆర్డీఓ కిరణ్‌కుమార్ పాల్గొని, రక్తదానం చేశారు. ఆస్పత్రిలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు. వృద్ధాశ్రమానికి 10 బియ్యం బస్తాలు అందిస్తామని, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ సభ్యులు సురేష్, నిరంజన్, అఖిల్ పాల్గొన్నారు.

చెమిర్తిలో ఉచిత వైద్య శిబిరం

గూడూరు మండలంలోని చెమిర్తి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరంలో వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన కేక్‌లను ఆర్డీఓ కిరణ్‌కుమార్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. అనంతరం చెమిర్తి సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, మేకనూరు వైఎస్సార్ సీపీ నాయకుడు రమేష్‌యాదవ్ ఆర్డీఓను శాలువాతో సత్కరించారు.